# ప్రేమ పిచ్చి ★

రచన :
శ్రీ సూర్యదేవర కృష్ణప్రసాద్.

ఆ రోజు శరత్ ఆనందం అంతా ఇంతా కాదు. తెలుగు సినిమాలో హీరో ఛాన్స్ తగిలినంతగా ఆనంద పడుతున్నాడు. ఈ రోజుల్లో ఒకమ్మాయి దగ్గర్నుంచి లవ్ లెటర్ రావటమంటే ఏ అబ్బాయికైనా పట్టలేని ఆనందమే కదా! అయితే ఇవన్నీ ఈ రోజుల్లో అతి సాధారణ విషయాలయ్యాయి.

శరత్ బి. ఎ. చదువుతున్నాడు. చెప్పుకోనదగ్గ అందగాడేమీ కాదు. అలాగని కురూపి అంతకన్నా కాదు. అమ్మాయిల్ని ఆకట్టుకోగల పర్సనాలిటీ ఉంది. అసలు వారిరువురి పరిచయం వారి దృష్టిలో మరపురాని విషయము.

ఆ రోజు శరత్ క్లాసు రూములోకి వెళ్ళగానే తన క్లాసులో కూర్చోబోతూ అలవాటు ప్రకారం జేబు తడుముకున్నాడు. కాని జేబులో ఉండవలసిన పెన్ను కనిపించలేదు. కంగారుగా బెంచీల క్రింద మైనా పడిందేమోనని క్లాసు రూమంతా కలియ తిరుగుతున్నాడు.

"ఎక్స్‌క్యూజ్ మీ" అన్న అతి చక్కనైన పిలుపుకు ఉలికిపడి వెనుతిరిగాడు. "ఏమిటో వెతుకుతున్నట్లున్నారు! ఏమైనా పోగొట్టుకున్నారా?" అన్నది వీణ మీటుతున్నట్లుగా. శరత్‌కు నోటమాట రాక కన్నార్పకుండా ఆమెనే చూస్తున్నాడు. తన ఎదురుగా తన స్వప్నాల రాణి! కాలేజీలో ఉన్నంత సేపు ఎవరికోసమైతే తన కళ్ళు వెతుకుతాయో ఆమె స్వయంగా తన ఎదుట ప్రత్యక్షమైంది.

"ఏమిటండీ. మాట్లాడరేం?!"

"ఆఁ ఏ ఏమీ లేదండి. నా పెన్నెక్కడో పోయినట్లుంటేనూ అందుకని" అంటూ తడబడుతూ తన చుట్టూ వెతకటం మొదలెట్టాడు.

"ఓహో థాంక్స్ గాండ్. అయితే ఆ పెన్ను మీదే నన్నమాట! నా కిందాంక మెట్ల దగ్గర దొరికింది. మీరేదో కంగారుగా వెతుకుతుంటే నా కపుడే అనుమానమొచ్చింది లెండి." అంటూ హ్యాండ్ బాగ్‌లో నుంచి పెన్ తీసిచ్చింది క్లాస్‌మేట్ సరిత.

"ఓ థాంక్యూ మిస్ సరితా థాంక్యూ వెరీమచ్" అంటూ ఆనందంగా ఉక్కిరి బిక్కిరవుతూ వణుకుతున్న చేతులతో పెన్నందుకున్నాడు.

"నాటెటాల్ మిస్టర్ శరత్. ఈ విధంగానైనా మీ పరిచయం కలగటం నా అదృష్టం నా కెంతో ఆనందంగా ఉంది. మరి మీకో," అంది పెదాలు అదోలా బిగించి. "విత్ ప్లజర్" మాత్రం అనగలిగాడు శరత్.

అంతే ఆనాటినుంచి వారి పరిచయం దిన దినాభివృద్ధి చెందుతూ వచ్చింది. ఒకరోజు తన స్నేహితుడు బాబు సహాయ సలహాలతో సరితకు లవ్ లెటర్ వ్రాశాడు.

మైడియర్ సరితా!

మన కలయిక తలచుకుంటేనే ఎంతో పులకింత కలుగుతోంది. 'సరితా నా హృదయపు కవితా నిన్ను చూచిన మొదటి చూపులోనే నేనేమనుకున్నానో నీకు తెలుసా? ఈ అపురూప సౌందర్యవతి నా జీవిత భాగస్వామినియైతే నా జీవితం ధన్యమవుతుంది.

సరితా! - ఒక నీటిబొట్టు ఇసుకలో పడితే ఇంకి పోతుంది. అదే నీటిబొట్టు సముద్రంలో పడితే ఎడ్రస్ లేకుండా పోతుంది. నీ ప్రేమ పొందగలిగితే ఇసుకలో నీటి బొట్టులా నీలో కలిసిపోతాను. లేకుంటే అంతులేని సముద్రంలో కలసిపోతాను. మరి నీవు నన్నేమి చేస్తావో! నాకు కవిత్వపు పిచ్చి పట్టిందనుకొంటున్నావా! కాదు కాదు ఇది ప్రేమ పిచ్చి. అది సరేగాని నా కోరికను మన్నించి రేపు ఆదివారం మార్నింగ్ షోకి రావాలి సుమా మర్చిపోకూడదు. నిన్ను కాలేజీ దగ్గర కల్సుకుంటాను. తప్పక రావాలి.

నీ కోసం ఎదురుచూసే
నీ మిత్రుడు.
శరత్.

సరిత ఏమంటుందో ఏమైనా గొడవ చేస్తుందేమోనని కంగారుగా కాలేజీ దగ్గర అటు ఇటు తిరుగుతున్న శరత్ హుషారుగా వస్తున్న సరితను చూచి ఆనందంగా ఎదురువెళ్ళాడు. ఇద్దరూ దగ్గర్లో ఉన్న సినిమా

థియేటర్‌కి వెళ్ళారు. సినిమా చూచి ఇంటికి వెళ్ళేటపుడు సరిత బ్యాగ్‌లో నుంచి ఒక లెటర్ తీసి శరత్ చేతిలో పెట్టి రిక్షాలో ఎక్కి వెళ్ళిపోయింది. ప్రక్కనే ఉన్న ఒక టీ స్టాలులో కూర్చుని ఆతృతగా ఆ లెటర్ చదవ నారంభించాడు శరత్.

డియర్ శరత్,

నీ లెటర్ చూచినవెంటనే ఎంత ఆనందపడ్డానో నా పడగ్గదిలో ప్రతి వస్తువుకూ తెల్సు. నీవు ప్రేమ లేఖలు చక్కగా వ్రాయగలవు. శరద్ డార్లింగ్ 'విరజాజుల వంటి సిరిసెది నీ మనస్సే పరిమళాలు వెదజల్లినది నీ లేఖ ద్వారా? ఈ డైలాగ్ నా స్వంతం కాదు మహాప్రభో! వచ్చే సన్‌డే నాఅభిమాన రచయిత్రి వ్రాసినదిలే! వచ్చే సన్‌డే కూడా మంచి పిక్చర్‌కు వెళదాం. ఏమంటావ్ డియర్? ఇంతకంటే ఎక్కువగా వ్రాసి ఈ రాత్రి నిద్ర పాడుచేయకుండా ఇంతటితో ముగిస్తూ-

ప్రేమతో

"నీ సరిత."

ఆ విధముగా శరట్ సరితల ప్రేమ లేకలు, వాగ్దానములు, సినిమాలు, పిక్నిక్‌లతో కాలము తెలిసేది కాదు ఇంగ్లీషు రోమాంటిక్ ఫిల్మ్ చూచినంత వేగముగా గడిచిపోయినది వారి కాలేజి జీవితము.

డిగ్రి పూర్తి కాగనే శరట్ అందరిలాగే ఉద్యోగాల వేటకు బయలుదేరి ఎలాగైతేనేమి హైద్రాబాద్‌లో ఒక టుబాకో కంపెనిలో క్లర్కు పోష్టు సాధించాడు. తెలుగు సినిమాకథలు బాగా వంటబట్టిన శరట్ తాను ప్రేమించిన అమ్మాయినే వివాహము చేసుకోవాలన్న లక్ష్యంతో సరితకు వెంటనే లెటర్ వ్రాశాడు.

డియర్ సరితా,

నాకు హైదరాబాద్‌లో ఒక టుబాకో కంపెనీలో జాబ్ వచ్చినది. సాలరీ మనిద్దరికి ఎంతో చక్క సరిపోతుంది, నమ్మకముగా పని చేస్తే ప్రమోషన్స్ వస్తాయి, మనక్క ఏలోటు రాదు. మన పెళ్ళి విషయము మీ నాన్నగారితో మాట్లాడి లెటర్ వ్రాయి, మా నాన్నగారిని ఒప్పించి ముహూర్తం పెట్టించుకుందాము.



కౌముదీ పిక్చర్స్ వారి

రంగుల చిత్రం

"రామబాణం"లో

బేబి దుర్గ.

మన రాజధాని హైద్రాబాద్‌లో రాణిగారితో ఈ రాజుగారు కొలువు చేస్తారు.

ఈ విధముగా వ్రాసి నవ్వుకొని లెటర్ ముగించాడు శరత్.

సరిత వ్రాసే లెటర్ కోసం ప్రతిరోజు ఆశతో ఎదురు చూస్తున్నాడు. పదిరోజులు తర్వాత ఆమెనుంచి లెటర్ ఆనందముగా అందుకున్నాడు.

డియర్ శరత్,

నిన్ను వివాహము చేసుకోవాలని ఏనాడూ ఆలోచించలేదు. జీవితము ఆనందముగా సరదాగా గడపటము నా హాబీ. మా పెద్దవాళ్ళు ఆడపిల్లలకు ఎక్కువగా డబ్బులు యివ్వరాదనే తత్వం గల వాళ్ళు. నా సరదాలు తీర్చుకోవాలంటే నాకు ఎవరో ఒకరు బాయ్‌ఫ్రెండ్ ఉండాలి. అట్టి వారిలో నాకు నీవు నచ్చావు. సాధారణముగా అబ్బాయిలు అమ్మాయిలకు ఎక్కువ డబ్బు గొప్ప కోసం ఖర్చు పెడతారు. అందుకే నేను నీకు లెటర్స్ వ్రాసి నీతోపాటు సరదాలు తీర్చుకున్నాను. ఈ విషయములలో నీకు పెద్ద నిరాశ కల్గించినందుకు రియల్లీ అయామ్ సారీ శరత్.

శుభవార్త: నాకు మీ కంపెనీ మేనేజర్ సూరిబాబుతో మా వాళ్ళు మేరేజ్ సెటిల్ చేశారు. వెడ్డింగ్ డేట్ బహుశ వచ్చే నెల 5వ తారీఖు కావచ్చును. వెడ్డింగ్ కార్డ్ వేయించగానే నీకు మొట్టమొదటా కార్డు పంపించుతాను. నీవు తప్పక రావాలి సుమా.

ప్రెజంటేషన్స్ ఏమీ తీసుకు రాకద్దు. ఎందుకంటే నా సరదాలుకోసం నీవు ఖర్చు పెట్టిందే నీ విచ్చిన పెళ్ళికానుక.

ఓ కే. గుడ్ బై మై ఫ్రెండ్

సరిత.

శరత్‌కు ఏమీ అర్ధం కానట్లయి అయోమయముగా ఆ ఉత్తరాన్ని మొదటినుంచి చివరదాక పదే పదే చదివాడు. ఒకవేళ సరిత తనను ఫూల్‌ను చేయుటానికి అలా వ్రాసిందేమో ననుకో సాగాడు. నిరాశముగా ఆ లెటర్‌ను తిరిగి కవర్‌లో ఉంచుతూ,

★

# పాప కోసం

★

రచన :

ఋషిశ్రీ కోరా.

"ఏ మాట కాదంటున్నందుకు మన్నించండి నాన్నా! నేను వెళ్తున్నాను." సూట్‌కేస్‌ను తీసుకొని తండ్రీ కూతుళ్ళ సంబంధాన్ని కట్ చేసుకొని తను వలచిన వానితో మిగిలిన జీవితాన్ని గడపాలనే ఉద్దేశంతో పుట్టింటి గడప దాటింది సౌమ్య.

స్టేషన్‌లో సౌమ్య రాకకోసం ఎదురు చూస్తున్నాడు భానుమూర్తి.

"నా చివరి ప్రయత్నం వ్యర్ధమైంది భానూ!"

"బాధ పడకు సౌమ్యా! మనం అనుకున్నట్లుగానే మా ఇంట్లో కూడా మన పెండ్లికి అభ్యంతరం తెలిపారు. నా ఆస్తి నాకు పంచి ఇచ్చారు. దాని మీద పదివేలు రావచ్చు. ఎలాగోలా బ్రతకొచ్చు"

"ఏమిటో భానూ! నాకు భయంగా ఉంది."

"నువ్వు ధైర్యంగా ఉండు సౌమ్యా! బండికి టైమవుతోంది. టికెట్స్ తీసుకొస్తానంటూ" వెళ్ళాడు భానుమూర్తి.

హైదరాబాద్ చేరారు. రిజిస్టర్ మేరేజ్ చేసుకొని యాదగిరిగుట్టకెళ్ళి దేవుని దర్శించారు. నగరంలో ఇల్లు దొరకాలంటే మాటలా? హోటల్లో రూం తీసుకున్నారు. చూడాల్సినవన్నీ చూశారు.

ఎలాగైతేనేం ఊరి బయట ఓ ఇల్లు దొరికింది.

ఆ చిన్న గదికి ఎనభైరూపాయలు అద్దె అంటే ఆశ్చర్యపడి "అంత అద్దెటండీ" అన్నది.

"ముప్ఫైరూపాయలకు లంకంత ఇల్లివ్వటానికి ఇదేం ముప్పాళ్ళ కాదు."

"ఆ! అన్నట్లు మర్చిపోయాను, నేను మా ఊరెళ్ళి మనకు రావలసిన డబ్బులు తీసుకొస్తాను, నువ్వు జాగ్రత్త"

"ఈ రోజే వెళ్ళాలా! రెండురోజులాగి వెళ్ళొచ్చు